# పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంపీడీవో శివకుమార్

వాంకిడి,డిసెంబర్18:గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చౌపన్ గూడ,పిపర్‌గోంది,పట్టాగూడ గ్రామాల్లో పర్యటించారు. పల్లె ప్రకృతి వనం,సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో నర్సరీలను సిద్ధం చేయాలని,హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నీటిని అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి గ్రామల్లో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టాలని కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్ కుమార్ ఉన్నారు.



వాంకిడి : పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శివ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్

## మ్యానిఫెస్టో లోని హామీలను నెరవేర్చాలి

ఆసిఫాబాద్,డిసెంబర్18 : కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వస్తే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులంతా గెలిపించుకున్నారని, నిరుద్యోగుల నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. మెగా డిఎస్సీ,గ్రూప్ 1,2 పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. జీవో నంబర్ 317తో జిల్లాలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని దాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, జాడి శ్యామ్,దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కా ర్యదర్శి వడ్లూరి శ్రీకాంత్,జిల్లా కోశాధికారి దుర్గం రాజ్ కుమార్,జిల్లా కమిటీ సభ్యులు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.

## రైతు బంధుకు దరఖాస్తు చేసుకోండి

వాంకిడి,డిసెంబర్18: గ్రామాల్లో ఎవరైనా రైతులకు కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చి ఉంటే వారు రైతు బంధు కోసం మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామాల్లో కొత్తగా భూములు విరాసత్ చేసుకున్నవారు, భూములు కొనుగోలు చేసిన వారు, కొత్తగా పట్టా పాసు పుస్తకాలు వచ్చిన వారు ఉంటే రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డ్, భూమికి సంబంధించిన జిరాక్స్ పత్రాలను జతచేసి రైతుబంధు కోసం మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## విద్యార్థులకు దుప్పట్లు అందజేత



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్

ఆసిఫాబాద్,డిసెంబర్18: మండలంలోని ఆర్ఆర్ కాలనీలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంపీపీ అరిగేలా మల్లికార్జున్ దుప్పట్లను పంపిణీ చేశారు. దుప్పట్లు లేక చలి తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎంపీపీ మల్లికార్జున్ దృష్టికి విద్యార్థులు తీసుకురావడంతో ఆయన సొంత ఖర్చులతో విద్యార్థులకు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగా పెరగడంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, ఎంఈవో మణుకుమార్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## కార్మికులకు ఐటీ రద్దు చేపిస్తాం

- బెల్లంపల్లి ఏరియా హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు

రెబ్బెన, డిసెంబర్ 18: సింగరేణిలో జరుగుతున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ యూనియన్‌ను గెలిపిస్తే కోల్ ఇండియాలో లాగా, సింగరేణి సంస్థలో కూడా పేర్క్స్ పై ఆదాయపు పన్ను యాజమాన్యమే చెల్లించే విధంగా కృషి చేస్తామని బెల్లంపల్లి ఏరియా హెచ్‌ఎంఎస్ యూనియన్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు పేర్కొన్నారు. సోమవారం ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏరియా వర్క్‌షాపునకు పూర్వవైభవం తీసుకరావడం కోసం కృషి చేస్తామని, అసుపత్రులను అధునీకరిస్తామన్నారు. కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే హెచ్‌ఎంఎస్ యూనియన్‌ను 27న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో బ్రాంచి సెక్రటరీ శివారెడ్డి, ఫిట్ సెక్రటరీ వసీం, ఆర్గనైజర్ ఇనూ స్, ఎస్అండ్‌పీసీ ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్, ఖైర్‌గూడ ఫిట్ సెక్రటరీ రామకృష్ణ, హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస్, ఆర్గనైజర్ సుంకరి ఓంకార్, జె.శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

- ఐఎన్టీయూసీని గెలిపిస్తేనే కార్మికులకు మరిన్ని హక్కులు

రెబ్బెన, డిసెంబర్ 18: సింగరేణిలో జరుగుతున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయుసీ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అనేక హక్కులను సాధిస్తామని ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు సిద్ధంశెట్టి రాజమౌళి, ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి లు పేర్కొన్నారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో సోమవారం ఐఎన్టీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఫిట్ కార్యదర్శి గుండ్ర రవికుమార్, నాయకులు మాధవకృష్ణ, జీపీ చంద్రకుమార్, పల్లాస్, సూర్యనారాయణ, కాంపెల్లి రమేశ్, రఫీ, అనిల్, రవీందర్ ఉన్నారు.



ఏరియా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు పత్తెం రాజబాబు

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 18 : జిల్లా కేంద్రంలోని పీటీజీ గిరిజన గురుకులంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. గురుకులం ప్రధాన కార్యాలయం నుంచి 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా రూపొందించి గురుకులాలకు సరఫరా చేశారు. ఈ క్రమంలో సోమవారం గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ సురేశ్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, గురుకులం అందించిన స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురుకులం విద్యార్థుల 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రత్యేక స్టడీ మెటీరియల్ అందజేసిందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ఓంకార్ కృష్ణ, పద్మ, ప్రియాంక, సచిందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్



ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలిస్తున్న ప్యానల్ టీం అధికారి పార్వతి

## మోడి ఆశ్రమ పాఠశాల పరిశీలన

కెరమెరి, డిసెంబర్ 18: మండలంలోని మోడి బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ప్యానల్ బృందం సభ్యులు సోమవారం పర్యవేక్షించారు. ప్యానల్ బృందం అధికారి పార్వతి ఆధ్వర్యంలో సభ్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఉండి అన్ని విధాలా పరిశీలించారు. విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాల పరిసరాలు, గదుల శుభ్రతతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించే బోధన తీరును పర్యవేక్షించారు. గిరిజన విద్యార్థులు చదువులో పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు పాత్ర ఎలా ఉంది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మకమైన విద్యను అందిస్తున్నారా లేదా అనే విషయాలను గ్రహించి పాఠశాలకు గ్రేడ్‌ను కేటాయిస్తూ పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ప్యానల్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణలత, ప్యానల్ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

## ఇంటి నంబర్ల కేటాయింపుపై విచారణ చేపట్టాలి

ఆసిఫాబాద్,డిసెంబర్18: ఆసిఫాబాద్ గ్రామ పంచాయతీతో పాటు అంకుశాపూర్ గ్రామా పంచాయతీ అధికారులు అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని సంబంధిత అధికారుల పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్,కార్తీక్ సోమవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్,అంకుశాపూర్ గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నంబర్ల ఇస్తున్న గ్రామ పంచాయతీ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా జిల్లాలో అక్రమ వెంచర్లకు బీడీపీపీ భూములకు,నాలా అనుమతులు లేకుండా కూడా ఇంటి నెంబర్లు, బై నంబర్లు కేటాయిస్తున్నారని అలాంటి వాటిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్,డిసెంబర్18ః పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆయా కళాశాల అర్హులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్సీ సంక్షేమాధికారి సజీవన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థుల వివరాలను వెబ్ సైట్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

## బీఎల్‌వోలకు శిక్షణ



బీఎల్‌వో లతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎస్ రమేశ్

సిర్పూర్(యు) డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల బీఎల్‌వో,సూపర్ వైజర్లకు ఓటరు జాబితాపై తహసీల్దార్ ఎస్ రమేశ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు పేర్లు, ఫొటోలు తప్పు ఉంటే సరిచేసుకోవాలన్నారు. దీంతో పాటు మరణించిన వారి పేర్లు ఓటరు జాబితాలో తీసివేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్ఐలు పవన్, హన్మంతరావ్, జూనియర్ అసిస్టెంట్ ఆత్రం వినయ్, బీఎల్‌వో సిబ్బంది ఉన్నారు.

## బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

వాంకిడి,డిసెంబర్18: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్పీ సందీప్ పిల్లల తల్లిదండ్రులను కోరారు. సోమవారం మండలంలోని ఇంధాని స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తేజిగుడా,ఘూట్ జనగాంలో బడి బయట పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించారు. 6గురు బడి బయట పిల్లలను గుర్తించి,వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను(ఎంపీయూపీఎస్) బెండార పాఠశాలలో చేర్పించారు.

## చర్యలు తీసుకోవాలి

రెబ్బెన, డిసెంబర్ 18: గోలేటి గ్రామ పంచాయతీలో తూతూ మంత్రంగా మొక్కలు నాటి, ట్రీ గార్డులు ఏర్పాటు చేయకుండా బిల్లులు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సోల్లు లక్ష్మిలు కోరారు. గోలేటి గ్రామంలో నాటిన మొక్కలు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను సోమవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాలు చికినం పద్మ, కుదురుపాక పద్మ, అంజమ్మ లతో పాటు పలువురు ఉన్నారు.